
సాక్షి అనకాపల్లి

ఆదివారం | 8 | జనవరి | 2023



విద్యుత్ చౌర్యంపై విజి'లెన్స్'

ఈపీడీసీఎల్ విద్యుత్ చౌర్యంపై నిరంతర దాడులు నిర్వహిస్తోంది. ఏడాది కాలంలో రూ.5.02 కోట్ల జరిమానాలు వసూలు చేసింది. IIIలో



మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట

మంత్రి సీదిరి అప్పలరాజు విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో రూ.2.75 కోట్లతో నిర్మించిన ఆధునిక చేపల మార్కెట్ భవనాన్ని ప్రారంభించారు. 116 మంది చేపలు అమ్ముకోవచ్చన్నారు. IIIలో

గోవాడ సుగర్స్ లాభాలే లక్ష్యం



డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దేవరాపల్లి మండలం తెనుగుపూడిలో తాత్కాలిక చెరకు తూనిక కేంద్రాన్ని ప్రారంభించారు. ఐదు లక్షల టన్నుల ఫ్యాక్టరీ క్రషింగ్ సామర్థ్యాన్ని చేరుకునేలా చెరుకు సాగు చేయాలని రైతులకు సూచించారు. IIలో

న్యూస్‌రీల్

తులసీరావు కుటుంబానికి జీవీఎల్ పరామర్శ



యలమంచిలి: దివంగత విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు కుటుంబాన్ని ఎంపీ జి.వి.ఎల్.నరసింహారావు, విశాఖ-పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పి.గణబాబు శనివారం పరామర్శించారు. యలమంచిలిలోని వారి స్వగృహానికి వెళ్లి తులసీరావు చిత్రపటానికి నివాళులర్పించారు. ఆడారి ఆనంద్‌కుమార్, పిళ్లా రమాకుమారి తదితర కుటుంబ సభ్యులతో మాట్లాడారు. తులసీరావు సేవలను గుర్తు చేసుకున్నారు.

ఏఎంసీలో వైద్య విద్య-పరిశోధనపై సదస్సు



మాట్లాడుతున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, పాల్గొన్న సీనియర్ వైద్యులు

మహారాణిపేట(విశాఖ దక్షిణ): గ్లోబల్ హెల్త్ కేర్ సమ్మిట్‌లో భాగంగా అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజన్ (ఏపీపీఐ) ఆధ్వర్యంలో శతాబ్ది ఉత్సవాల సందర్భంగా శనివారం ఆంధ్రా మెడికల్ కాలేజీలో సదస్సు జరిగింది. ముందుగా కమిటీ ప్రతినిధి డాక్టర్ పి.వి.సుధాకర్ సదస్సు లక్ష్యాలను వివరించారు. మాజీ డీఎంఈ, అపోలో యూనివర్సిటీ ప్రో చాన్సలర్ డాక్టర్ టి.రవిరాజు మెడికల్ ఎడ్యుకేషన్ ఎట్ క్రాస్‌రోడ్స్ అనే అంశంపై ప్రసంగించారు. నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రెసిడెంట్ డాక్టర్ అభిజిత్ షేత్ నేషనల్ మెడికల్ కమిషన్ గురించి, వైద్యరంగంలో భారతదేశ అవసరాల గురించి వివరించారు. న్యూయార్క్‌లోని బ్రాంక్స్ కేర్ ఆస్పత్రి ఫిజీషియన్-ఇన్-చీఫ్ డాక్టర్ శ్రీధర్ చిలిమూరి 'అమెరికాలోని మెడికల్ ఎడ్యుకేషన్‌తో పాటు ఎడ్యుకేషన్‌లో పరిశోధనలను ఎలా చేయాలి'అనే అంశంపై ప్రసంగించారు. వైద్య విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. హైదరాబాద్‌లోని అపోలో మెడికల్ కాలేజీ డీన్ డాక్టర్ రేఖా ఆర్కాట్ ఎంబీబీఎస్ తర్వాత కెరీర్ అవకాశాలపై విద్యార్థులకు సూచనలు చేశారు. అమెరికాకు చెందిన డాక్టర్ లోకేష్ ఈదర వైద్య విద్యార్థుల సందేహాలకు సమాధానమిచ్చారు. ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు సమ్మిట్, డాక్టర్ బి.దేవి మాధవి, డాక్టర్ వై.పద్మశ్రీ తదితరులు మాట్లాడారు.

19న వాహనాల ఈ-వేలం

మహారాణిపేట(విశాఖ దక్షిణ): వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో పనిచేయని 21 వాహనాలను ఈ నెల 19న ఈ-వేలంలో విక్రయిస్తున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వేలం-1లో 11 వాహనాలు, 2 గంటల నుంచి 5 గంటల వరకు వేలం-2లో 10 వాహనాలను వేలం వేస్తామన్నారు. ఇతర వివరాల కోసం https:// konugolu.ap.gov.in ను సందర్శించాలని సూచించారు.

డిబ్రూఘడ్-కన్యాకుమారి ఫ్రీక్వెన్సీ పెంపు

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): ప్రయాణికుల డిమాండ్ మేరకు ప్రస్తుతం బైవీక్లీ ఎక్స్‌ప్రెస్‌గా నడుస్తున్న డిబ్రూఘడ్-కన్యాకుమారి-డిబ్రూఘడ్ ఎక్స్‌ప్రెస్‌ను త్వరలో వారానికి నాలుగు రోజులు నడిచే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. మే 7 నుంచి డిబ్రూఘడ్‌లో బయల్దేరే డిబ్రూఘడ్-కన్యాకుమారి (15906) వివేక్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ శని, ఆది, మంగళ, గురువారాలలో వారానికి నాలుగుసార్లు బయల్దేరుతుంది. తిరుగు ప్రయాణంలో కన్యాకుమారిలో మే 11 నుంచి బయల్దేరే కన్యాకుమారి-డిబ్రూఘడ్(15905)వివేక్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ బుధ, గురు, శని, సోమవారాలలో వారానికి నాలుగుసార్లు బయల్దేరుతుంది.



ఉమ్మడి విశాఖ జిల్లాలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు	10,295
బదిలీ కోసం వచ్చిన దరఖాస్తులు	5,868
ఇందులో కంపల్సరీ బదిలీ దరఖాస్తులు	1,010
రిక్వెస్ట్ బదిలీ దరఖాస్తులు	4,858
వచ్చిన గ్రీవెన్స్	663

అయ్యవార్లు.. అడ్డదారులు..!

అగనంపూడి మండలంలోని ఓ ఉపాధ్యాయుడు విశాఖపట్నం సమీపంలోనే పాఠశాలలోనే పోస్టింగ్ దక్కించుకునేలా డిపెండెంట్‌కు గుండె జబ్బుకు పొందే ట్రీట్‌మెంట్‌తోనే ఏకంగా ఆపరేషన్ చేయించుకుంటున్నట్లు ఆన్‌లైన్‌లో ఆప్షన్ ఇచ్చి, బదిలీల్లో ఎక్కువ పాయింట్లు పొందాడు. అతను పెట్టిన ధృవీకరణ పత్రంతో ఆ స్థాయిలో పాయింట్లు రావని గుర్తించిన విద్యాశాఖాధికారులు ఆ ఆప్షన్‌ను తిరస్కరించారు.

మాడుగుల మండలంలోని ఓ ఉపాధ్యాయురాలు గతంలో స్పౌజ్ కోటా వినియోగించుకున్నప్పటికీ, తాజాగా మళ్లీ అదే కోటాతో బదిలీ కోసమని దరఖాస్తు చేసి ఎక్కువ పాయింట్లు పొందారు. విద్యాశాఖాధికారుల పరిశీలనలో ఆ కోటా కింద పొందిన పాయింట్లను రద్దు చేశారు.

- బదిలీల్లో ఉపాధ్యాయుల తప్పుడు పద్ధతులు
- పాయింట్ల కోసం స్పౌజ్ దుర్వినియోగం
- దరఖాస్తుల పరిశీలనతో వెలుగులోకి..
- 200 మందిని గుర్తించిన విద్యాశాఖాధికారులు
- సిద్ధమైన జాబితా, ఉపాధ్యాయుల్లో గుబులు
- పేర్లు తప్పించేలా డీఈవో కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు

విశాఖ విద్య: ఉపాధ్యాయులందరికీ ఆమోదయోగ్యకరమైన రీతిలో బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా.. కొంతమంది సర్వీసు పరమైన అంశాలపై కోర్టును ఆశ్రయించారు. కోర్టు తుదితీర్పుకు అనుగుణంగా బదిలీల ప్రక్రియలో ముందుకెళ్లేందుకు అంతా సిద్ధం చేసుకోవాలనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖాధికారులు సీనియార్టీ జాబితాలపై కసరత్తు చేస్తున్నారు. ఈ క్రమంలో కొంతమంది ఉపాధ్యాయులు చేసిన తప్పిదాలు వెలుగులోకి వచ్చాయి. నచ్చిన చోట మళ్లీ తిష్ట వేయాలనే దుర్బుద్ధితో కొంతమంది అయ్యవార్లు తప్పుడు ధృవీకరణ పత్రాలతో బదిలీ కోసం దరఖాస్తు చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇలా 200 మందికి పైగానే ఉన్నట్లు లెక్క తేలింది.

ఆన్‌లైన్‌తో ముందుగానే చెక్

జిల్లాల పునర్విభజన నేపథ్యంలో సొంత జిల్లాలోని సొంతూర్లకు దగ్గరగా వెళ్లేలా ఈ సారి ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ప్రాతిపదికన బదిలీలకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. పారదర్శకత కోసం బదిలీల ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లోనే నిర్వహించేలా విద్యాశాఖాధికారులు దరఖాస్తులు స్వీకరించారు. ఈ నేపథ్యంలో ఎటువంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా, ఈ సారి ఎంఈవో, డీఈవో స్థాయిలో ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించారు. దీని వల్ల తప్పుడు పద్ధతులు అవలంబించిన వారిని ముందుగానే గుర్తించి, అలాంటి దరఖాస్తులను తిరస్కరించారు.

పేర్లు తప్పించేలా ప్రదక్షిణలు

బదిలీల్లో పొరపాట్లకు తావులేకుండా ఉపాధ్యాయులకు డీఈవో స్థాయిలో గ్రీవెన్స్‌కు అవకాశం కల్పించారు. ఒకవేళ ఎవరైనా తెలియక, తప్పుడు ధృవీకరణ పత్రాలు ఆన్‌లైన్‌లో పెట్టినా, వాటిని వెనక్కి తీసుకునే వెసులుబాటు కల్పించారు. ఇలా 663 మంది దరఖాస్తు చేసుకోగా, వాటిని డీఈవో స్థాయిలో పరిష్కరించారు. అయినప్పటికీ కొంతమంది ఉపాధ్యాయులు గుంబనంగా ఉండిపోయారు. ఇలాంటి వారు తాజాగా వెలుగులోకి రావటంతో, శాఖాపరమైన క్రమశిక్షణ చర్యల నుంచి తప్పించుకునేలా తమ పేర్లు జాబితా నుంచి తొలగించాలని డీఈవో కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

పారదర్శకంగా బదిలీలు



బదిలీలు పారదర్శకంగా జరిపించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ఎంఈవో, డిప్యూటీ డీఈవో స్థాయిలో దరఖాస్తుల పర్యవేక్షణ జరిగింది. ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా కేడర్ వారీగా సీనియార్టీ జాబితాలను సిద్ధం చేశాం. తప్పుడు ధృవీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకున్న వారిని గుర్తించి వాటిని తొలగించాం. అలాంటి వారిపై ఏ మేరకు క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలనేది ఉన్నతాధికారులకు నివేదించాం.

– ఎల్ చంద్రకళ, నోడల్ అధికారి, ఉమ్మడి విశాఖ జిల్లా

ఫ్యాన్ జోరు.. మరో మారు..



పాయకరావుపేటలో సిద్ధమవుతున్న సభా ప్రాంగణం

- నేడు పాయకరావుపేటలో వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం
- దిశానిర్దేశం చేయనున్న పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

నక్కపల్లి: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా జరుగుతున్న పాయకరావుపేట నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. జాతీయ రహదారి పక్కన పోలీస్‌స్టేషన్ ఎదురుగా రఘుపతి కల్యాణమండపం పక్కన సభా వేదిక ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అధ్యక్షతన ఆదివారం జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పార్టీ అనకాపల్లి, విశాఖ, విజయనగరం జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ, ఎన్నికల పరిశీలకుడు చింతలపూడి వెంకటరామయ్య హాజరుకానున్నారు. మూడేళ్ల తర్వాత నాలుగు మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేస్తున్న సమావేశం కావడంతో అన్ని గ్రామాల నుంచి కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరానున్నారు. కల్యాణమండపం పక్కన పెంటార్లు, షామియానాలు వేసి పెద్ద వేదిక ఏర్పాటు చేస్తున్నారు.

కూలిన టీడీపీ కంచుకోట

తొలి నుంచి టీడీపీకి కంచుకోటగా ఉన్న పాయకరావుపేట నియోజకవర్గంలో 2009 నుంచి బీటలు వారడం మొదలైంది. ఆ సంవత్సరం మహానేత వైఎస్సార్ నాయకత్వంలో కాంగ్రెస్ నుంచి గొల్ల బాబూరావు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భవించాక 2012లో జరిగిన ఉప ఎన్నికల్లో కూడా పార్టీ తరపున బాబూరావు గెలుపొందారు. మళ్లీ 2019 ఎన్నికల్లో నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా 31 వేల ఓట్ల మెజార్టీతో టీడీపీపై బాబూరావు విజయ దుందుభి మోగించారు. పార్టీకి బలమైన నాయకత్వం, కార్యకర్తలు ఉన్నారు. ప్రజల్లో మంచి ఆదరణ ఉంది. నాలుగు మండలాల జడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎంపీపీ, వైస్ ఎంపీపీ పదవులను వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంది. అలాగే 80 శాతం సర్పంచ్ పదవులు సైతం పార్టీ మద్దతుతో గెలిచిన వారే ఉన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాల అమలు తీరును సమీక్షించేందుకు నిర్వహిస్తున్న గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. విమర్శలకు తావు లేకుండా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు రాజకీయాలకు అతీతంగా అమలు జరుగుతున్నాయి. దీంతో ప్రజల్లోకి వెళ్లి ధైర్యంగా ఓటు అడిగే హక్కు మన పార్టీకే ఉందని చాటి చెప్పడం కోసం, రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసి 2024 ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తీసుకు వచ్చే విధంగా దిశానిర్దేశం చేసేందుకు నియోజకవర్గాల వారీగా విస్తృత సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో పాయకరావుపేట నుంచి ఇందుకు శ్రీకారం చుడుతున్నారు.



వేదిక ఏర్పాటు చేసే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు, పార్టీ నాయకులు

పోలీసు స్టేషన్ భవనం ప్రారంభం



పోలీస్‌స్టేషన్ భవన ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

కె.కోటపాడు : ఎన్నో ఏళ్లుగా అద్దె భవనంలో కొనసాగుతున్న స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సొంత భవనం సమకూరడం ఆనందంగా ఉందని డిప్యూటీ సీఎం, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖా మంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. ఒకే ప్రాంగణంలో నిర్మించి కె.కోటపాడు పోలీసుస్టేషన్, పోలీసు సర్కిల్ కార్యాలయం, అతిథి గృహాల ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని అనకాపల్లి ఎంపీ బి.వి.సత్యవతి, విశాఖ రేంజ్ డీఐజీ హరికృష్ణలతో కలిసి శనివారం ఆయన ఆవిష్కరించారు. తరువాత కె.కోటపాడు పోలీస్‌స్టేషన్ భవనాన్ని ఎంపీ సత్యవతి, సర్కిల్ కార్యాలయ భవనాన్ని డీఐజీ హరికృష్ణ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ సత్యవతి మాట్లాడుతూ ఈ భవనాల నిర్మాణ విషయంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం హర్షణీయమన్నారు. భవనాల నిర్మాణం పూర్తయ్యేందుకు సహకరించిన డిప్యూటీ సీఎంకు డీఐజీ హరికృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. కె.కోటపాడులో సర్కిల్ కార్యాలయం ప్రారంభం కావడంతో నాలుగు మండలాల ప్రజలకు పోలీసుసేవలు మరింత అందుబాటులోకి రానున్నట్టు ఆయన తెలిపారు. భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ముందుగా పోలీసుల నుంచి గౌరవవందనం స్వీకరించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎస్పీ గౌతమి సాలి, డీఎస్పీ సునీల్, ఎంపీ సత్యవతి భర్త విష్ణుమూర్తి, సీఐ తాతారావు, ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, జెడ్పీటీసీలు ఈర్లె అనురాధ, కర్రి సత్యం, ఎస్‌ఐ ధనుంజయ్, బి.రామకృష్ణతో పాటు పలు పోలీస్‌స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా బాస్కెట్‌బాల్ పోటీలు

ఏపీ అంతర్ జిల్లాల అండర్-19 బాస్కెట్‌బాల్ పోటీలు అనకాపల్లిలో ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జేసీ కల్పనాకుమారి క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. IIలో



యూడైస్ డేటా ఆధారంగా స్వచ్ఛ విద్యాలయ అవార్డులు



మాట్లాడుతున్న దేవానందరెడ్డి

అనకాపల్లి టౌన్/మునగపాక: దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయలను మెరుగుపరచడంపై దృష్టి సారించినట్టు ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా జిల్లా ప్రత్యేకాధికారి, ప్రభుత్వ ఎగ్జామినేషన్ బోర్డు డైరెక్టర్ దేవానందరెడ్డి చెప్పారు. అనకాపల్లిలోని జీవీఎంసీ వేల్పుల వీధి బాలికోన్నత పాఠశాల ఆవరణలో జిల్లాలో వివిధ మండలాల ఎంఈవోలతో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మౌలిక సదుపాయాలు బాగున్న పాఠశాలలను యూడైస్ డేటా ఆధారంగా ఎంపిక చేసి స్వచ్ఛ విద్యాలయ అవార్డులు అందిస్తామన్నారు. జిల్లాలో 561 పాఠశాలలతో జాబితా తయారు చేశామని, అందులో 403 ఎంట్రీకి అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. మౌలిక వసతులు, పాఠశాల వాతావరణం, ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు ఆధారంగా వీటిని గుర్తించామన్నారు. ఇందులో మంచి పనితీరు కనబరచిన పాఠశాలలను మండలానికి రెండు వంతున ఎంపిక చేసి అవార్డు అందిస్తామన్నారు. అనకాపల్లి రూరల్ మండలం నుంచి రెండు, పట్టణం నుంచి రెండు పాఠశాలలను ఎంపిక చేస్తారన్నారు. హెచ్‌లతో సమీక్ష జరిపి తీర్మానం చేసిన జాబితాను 13వ తేదీలోపు రాష్ట్ర కార్యాలయానికి సమర్పించవలసి ఉంటుందన్నారు. డీఈవో లింగేశ్వరరెడ్డి, డిప్యూటీ డీఈవో ప్రేమ్‌కుమార్, జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ రవిబాబు పాల్గొన్నారు. దేవానందరెడ్డి మునగపాక ఎంపీపీ స్కూల్‌తోపాటు జిల్లా పరిషత్ హైస్కూల్‌ను సందర్శించారు. నాడు-నేడుతో అభివృద్ధి చేసిన తరగతి గదులను పరిశీలించారు. అకడమిక్ మానిటరింగ్ అధికారి లక్ష్మి, ఎంఈవో వేణుగోపాలరావు, హెచ్‌ఎంలు కాండ్రేగుల సూర్యనారాయణ, సావిత్రి పాల్గొన్నారు.

దళితులంటే అంత చులకనా?

- దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలి
- కఠినమైన సెక్షన్లు నమోదు చేయాలి
- రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్
- ఉద్దండపురంలో బాధితులకు పరామర్శ



ఉద్దండపురంలో దళితులను పరామర్శిస్తున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

నక్కపల్లి: ఉద్దండపురంలో దళితుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడమే కాకుండా వారిపై దాడులకు పాల్పడ్డ వ్యక్తులపై కఠినమైన సెక్షన్లతో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎం.విక్టర్ ప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన గ్రామాన్ని సందర్శించారు. దాడులకు గురైన బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాజీ సర్పంచ్ పేకేటి రాజారావు దళితులను కించపరిచే విధంగా మాట్లాడాడన్నారు. దీనిని ప్రశ్నించిన దళితులపై తన అనుచరులతో దాడులకు పాల్పడ్డాడన్నారు. ఈ గ్రామంలో దళితులు తక్కువ సంఖ్యలో ఉన్నందువల్ల ఇటువంటి దాడులు జరుగుతున్నాయన్నారు. ఇటువంటి ఘటనలను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తీవ్రంగా పరిగణిస్తున్నారన్నారు. దాడులకు పాల్పడిన వారు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తి లేదన్నారు. గ్రామంలో ఇటువంటి సంఘటనలను పునరావృతం కాకుండా అన్ని కులాలకు చెందిన పెద్దలంతా కలసి సమావేశం ఏర్పాటు చేసుకుని శాంతి కమిటీ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ విధమైన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, పోలీసు యంత్రాంగాలను ఆదేశించామన్నారు. రాళ్లతో దాడి చేయడం అంటే మారణాయుధాలతో దాడి చేయడమేనన్నారు. ఈ విషయాన్ని పోలీసులు ఎఫ్ఐఆర్‌లో ఎక్కడా పేర్కొనలేదన్నారు. తక్షణమే కఠినమైన సెక్షన్లు నమోదు చేసి నిందితులందరినీ అరెస్టు చేయాలని డీఎస్పీ ప్రవీణ్ కుమార్, సీఐ నారాయణరావులను ఆదేశించారు.

బాధితులకు నిత్యావసర సరకుల పంపిణీ

దాడులకు గురైన ఉద్దండపురంలోని దళిత కుటుంబాలకు నాసా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుడు సోనీవుడ్, సంస్థ డైరెక్టర్ సుజిత్ కాంత్ ఈ సరకులను బాధితులకు అందజేశారు. సుమారు 40 కుటుంబాలకు వీటిని అందజేసినట్టు సోనీవుడ్ తెలిపారు. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా పోలీసులు పికెట్‌ను కొనసాగిస్తున్నారు.

గురుదేవుడికి ప్రణమిల్లి..



సద్గురు దేవానంద సరస్వతీ మహారాజ్ ఆరాధన మహోత్సవం దేవరాపల్లి మండలం కొత్తపెంట లోగల స్వామీజీ ఆశ్రమంలో శనివారం అత్యంత వైభవంగా జరిగింది. దేశం నలుమూలల నుంచి భక్తులు, శిష్యులు హాజరై స్వామీజీ విగ్రహానికి విశేష పూజలు చేశారు. IIIలో

గోవాడ సుగర్ ఫ్యాక్టరీ లాభాల బాటే లక్ష్యం

తెనుగుపూడిలో తాత్కాలిక చెరుకు కాటాను ప్రారంభించిన డిప్యూటీ సీఎం బూడి


కాటా వద్ద చెరకు సరఫరాను జెండా ఊపి ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

దేవరాపల్లి: గోవాడ సుగర్ ఫ్యాక్టరీని లాభాల బాటలో నడిపించేందుకు చెరకు రైతులతోపాటు కార్మికులు శ్రమించాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. ఐదు లక్షల టన్నుల ఫ్యాక్టరీ క్రషింగ్ సామర్థ్యాన్ని చేరుకునేలా చెరుకు సాగు చేయాలని రైతులకు సూచించారు. ఈ మేరకు దేవరాపల్లి మండలం తెనుగుపూడిలో తాత్కాలిక చెరకు తూనిక కేంద్రాన్ని గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ఎండీ వి. సన్యాసినాయుడుతో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. ముందుగా కాటా వద్ద పూజలు చేసి చెరకు సరఫరాను ప్రారంభించారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఈ తాత్కాలిక కాటాకు ఐదేళ్ల పాటు నిరంతరంగా చెరకు సరఫరా చేసే రైతులందరినీ ఫ్యాక్టరీలో శాశ్వత సభ్యులుగా చేర్చుకుంటామన్నారు. చెరకు టన్నుకు మద్దతు ధర రూ.2,817.25 ప్రకటించామని, చెరకు సరఫరా చేసిన 20 రోజుల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా చెరకు రైతులకు సకాలంలో పేమెంట్లు చెల్లించలేని పరిస్థితికి చేరుకుందన్నారు. ఈ నేపథ్యంలో గోవాడ సుగర్ ఫ్యాక్టరీని యథావిధిగా నడిపించాలని తనతోపాటు పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కోరగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అంగీకరించారన్నారు. రాష్ట్రంలో చాలా సుగర్ ఫ్యాక్టరీలు మూతపడే స్థితికి చేరుకోగా, గోవాడ ఫ్యాక్టరీకి మాత్రం ఆ పరిస్థితి లేదన్నారు. దీనిని కాపాడుకోవాల్సిన బాధ్యత రైతులు, కార్మికులపైనే ఉందన్నారు. జెడ్పీటీసీ కర్రి సత్యం, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వరదపురెడ్డి సింహాచలంనాయుడు, సీనియర్ నాయకుడు అవుగడ్డ రామ్మూర్తి నాయుడు, వైస్ ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి, సీనియర్ ఉగ్రాకుల అప్పారావు, వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు రొంగలి నారాయణమ్మ, సర్పంచ్ తాడి సామాలు, ఉప సర్పంచ్ కాటిపాం పెదనాయుడు, ఫ్యాక్టరీ సీడీవో కలిమి రామం, ఉద్యోగుల యూనియన్ నాయకుడు భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బాస్కెట్‌బాల్ పోటీలు

- ఏఎంఏఎల్ కళాశాల మైదానంలో అండర్–19 ఎంపికలు


ఫ్లాగ్‌మార్చ్ చేస్తున్న క్రీడాకారులు


గౌరవ వందనం స్వీకరిస్తున్న జేసీ కల్పనా కుమారి

అనకాపల్లి రూరల్: స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో 66వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏపీ అంతర్ జిల్లాల అండర్–19 బాల, బాలికల విభాగంలో బాస్కెట్‌బాల్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలను జేసీ కల్పనాకుమారి శనివారం ప్రారంభించారు. ముందుగా ఎన్‌సీసీ, ఆర్మీ, నేవీ విభాగాలకు సంబంధించి గౌరవ వందనం ఆమె స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. ఓడినంత మాత్రాన నిరాశ చెందకూడదని, నిరంతరం గెలుపు సాధన చేయాలని సూచించారు. క్రీడల్లో మెలకువలు నేర్చుకోవాలన్నారు. ఈ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్టు సెలెక్టర్లు తెలిపారు. బాస్కెట్‌బాల్ రాష్ట్ర పరిశీలకుడు ఎం.ఎం శ్రీనివాసరావు, జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి పి.మురళీధర్, ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాంబాబు, అనకాపల్లి వర్తక సంఘం కార్యదర్శి కొణతాల లక్ష్మీనారాయణ, కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు మంగరాజు, దాడి శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మహేశ్వరరావు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

జనసేన నాయకులపై కేసులు నమోదు

నక్కపల్లి: మండలంలో రాజయ్యపేటలో శుక్రవారం గ్రామసభ నిర్వహిస్తున్న సర్పంచ్ పిక్కి అప్పలనర్స, కార్యదర్శి రాజశేఖర్‌లపై దాడి చేసిన ఘటనకు సంబంధించి జనసేన నాయకులు పిక్కి స్వామి, పిక్కి కోటి, మైలపల్లి ప్రసాద్‌లపై పోలీసులు కేసులు నమోదు చేశారు. రాళ్లు రువ్వి తమపై హత్యాయత్నానికి పాల్పడ్డారంటూ శుక్రవారం బాధిత సర్పంచ్ కార్యదర్శులు పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. వీరి ఫిర్యాదు ఆధారంగా జనసేన నాయకులపై 353, 323, 324 మరియు 34 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తామని పోలీసులు తెలిపారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

తమకు రక్షణ కల్పించకపోతే మండలంలో ఉద్యోగాలు చేయలేమని పలువురు పంచాయతీ కార్యదర్శులు పేర్కొన్నారు. శనివారం వారు ఎంపీడీవో సీతారామరాజుకు వినతి పత్రం ఇచ్చారు. రాజయ్యపేట ఘటనలో జనసేన నాయకులు దాడి చేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. విధి నిర్వహణలో దాడి చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. కార్యదర్శిపై దాడి విషయాన్ని డీపీవో కలెక్టర్, ఎస్పీల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయం ఎంపీడీవో హామీ ఇచ్చారు. కార్యదర్శులు రాజశేఖర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

అనకాపల్లిటౌన్: మండలంలో కూండ్రం గ్రామానికి చెందిన సీహెచ్.ప్రసాద్ విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. రూరల్ ఎస్‌ఐ నరసింగరావు వివరాల ప్రకారం.. భార్యాభర్తలు ప్రసాద్, మంగలకు శుక్రవారం ఉదయం ఘర్షణ జరిగింది. దీంతో మనస్థాపం చెందిన ప్రసాద్ అదే రోజు మధ్యాహ్నం తన పొలంలోకి వెళ్లి పురుగు మందు సేవించాడు. అక్కడ అపస్మారకస్థితికి చేరిన భర్తను భార్య హుటాహుటిన అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించి, అక్కడ నుంచి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

గబ్బాడ చెరువులో చేపలు మృతి


చెరువులో మృతి చెందిన చేపలు

నర్సీపట్నం : మండలంలో గబ్బాడ చెరువులో చేపలు మృతి చెందాయి. రైతుల ఆమోదం మేరకు మత్స్యకారులు మూడేళ్లుగా చెరువులో చేపలను పెంచుతున్నారు. వేలాది చేపలు శనివారం మృతి చెందాయి. రూ.3 లక్షలు విలువ చేసే ఐదు టన్నుల చేపలు చనిపోయాయని మత్స్యకారు సొసైటీ సభ్యులు చెబుతున్నారు. చెరువును అనుకొని ఉన్న భూమిని ఆక్రమించిన రియల్టర్లను మత్స్యకారులు, గ్రామస్తులు అడ్డుకోవడం జరిగిందని, దీంతో తమపై కక్ష పెంచుకుని రియల్టర్లు చెరువులో విషపూరితమైన పురుగుమందును కలపడం వల్లనే చేపలు చనిపోయాయని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని మత్స్యకార సొసైటీ సభ్యులు తెలిపారు.

అయ్యన్నా.. ఎందుకు దాక్కున్నావు

- సీఎంను అడ్డుకుంటానని బీరాలు పలికి ఏమైపోయావు
- ఎమ్మెల్యే గణేష్ ఎద్దేవా


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్

నాతవరం: సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నర్సీపట్నం వస్తే అడ్డుకుంటామని బీరాలు పలికిన అయ్యన్న వైజాగ్ పోయి దాక్కున్నాడని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఎద్దేవా చేశారు. నాతవరంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు చినగొలుగొండపేట ఎస్.బి.పట్నంలో మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు సీఎంపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. నర్సీపట్నంలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి నాలుగు గంటలకు పైగా ఉంటే నీవు ముందురోజే విశాఖపట్నం వెళ్లిపోయి ఎందుకు దాక్కున్నావన్నారు. రూ.500 కోట్ల వ్యయంతో మెడికల్ కాలేజీ నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారని, అయితే మెడికల్ కాలేజీ మంజూరు కాలేదని అయ్యన్న పాత్రుడు ప్రచారం చేస్తున్నారని, ఆయన మాటలు నమ్మవద్దని తెలిపారు. మాకవరపాలెం మండలం భీమబోయినపాలెంలో మెడికల్ కాలేజీ పనులు చురుగ్గా జరుగుతున్నాయని, అక్కడకు వెళ్లి చూసి మాట్లాడాలన్నారు. టీడీపీ హయాంలో మీ మాదిరిగా శంకుస్థాపనలు చేసి, పనులు చేయకుండా వదిలివేయలేదన్నారు. మంత్రి హోదాలో నర్సీపట్నంలో ట్యాంక్‌బండ్, మినీస్టేడియంల నిర్మాణానికి శంకుస్థాపన చేసి వదిలేసిన ఘనత మీకే దక్కుతుందని తెలిపారు. వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి రోడ్డు నిర్మాణానికి, కాపువీధిలో కల్యాణమండపం, బలిఘట్టంలో కల్యాణమండపం నిర్మాణానికి పెద్దపెద్ద శిలాఫలకాలు ఏర్పాటు చేసి, పనులు చేయకుండా వదిలేయలేదా అని ప్రశ్నించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, చూసి ఓర్వలేకే చంద్రబాబునాయుడు ప్రజల్లోకి వెళ్లి అలజడి సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో అయ్యన్న, చంద్రబాబునాయుడులకు తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ అన్నారు.

క్లుప్తంగా

పీవీ చలపతిరావు విగ్రహం ఏర్పాటు చేయాలి

సంస్మరణ సభలో జీవీఎల్



చలపతిరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జీవీఎల్ తదితరులు

ఎంవీపీకాలనీ (విశాఖ తూర్పు): కార్యదక్షతకు భారతీయ జనతాపార్టీ సీనియర్ నాయకుడు పీవీ చలపతిరావు నిలువెత్తు నిదర్శనమని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అన్నారు. చలపతిరావు మృతి బీజేపీ తీరని లోటన్నారు. శనివారం బీజేపీ నగర కార్యాలయంలో చలపతిరావు సంస్మరణ సభను పార్టీ నాయకత్వం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని పీవీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. పీవీ చలపతిరావు విగ్రహాన్ని ప్రభుత్వం బీచ్‌రోడ్డులో ఏర్పాటు చేయాలని జీవీఎల్ కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్‌రాజు, పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, సీనియర్ నాయకులు ఎస్.గజపతిరావు, పృధ్వీరాజ్, విశ్వహిందూ పరిషత్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి హుండీ ఆదాయం రూ.70.12 లక్షలు



హుండీలు లెక్కిస్తున్న సిబ్బంది

డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): కనకమహాలక్ష్మి హుండీ ఆదాయం లెక్కింపు శనివారం చేపట్టారు. రూ.70,12,294, 141 గ్రాముల 500 మిల్లీగ్రాముల బంగారం, 2 కేజీల 450 గ్రాముల 200 మిల్లీగ్రాముల వెండి వచ్చింది. అలాగే 169 యూఎస్‌ఏ డాలర్లు, యూరోపియన్ యూనియన్‌కు చెందిన 5 యురోలు, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌కు చెందిన 20 పౌండ్లు, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ జోర్డాన్‌కు చెందిన 1 దినర్ వచ్చింది. హుండీ ఆదాయం లెక్కింపులో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు సత్య రూపవాణి, ధనలత, అనురాధ, ఎస్‌ఎస్‌ఎస్ సుబ్రహ్మణ్యం, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి వెంపలి రాంబాబు, అనకాపల్లి, మునగపాక గ్రూప్ టెంపుల్స్ గ్రేడ్-1 కార్యనిర్వహణాధికారి పి సత్యనారాయణమూర్తి, గోపాలపట్నం శ్రీహరి సేవా సభ్యులు, బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏఓ కె సురేష్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

దాకమర్రి ప్లాట్ల కేటాయింపులు



లాటరీ తీస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల

దొండపర్తి(విశాఖ దక్షిణ): భీమిలి మండలంలో దాకమర్రి ఫార్చ్యూన్ హిల్స్ లే అవుట్‌లో ప్లాట్లకు వీఎంఆర్‌డీఏ అధికారులు లాటరీ నిర్వహించి దరఖాస్తుదారులకు కేటాయింపులు చేశారు. వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని సంస్థ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల ప్రారంభించి లాటరీ ద్వారా 150 ఎల్‌ఐజీ ప్లాట్ల కేటాయింపులు చేపట్టారు. ఇందులో ప్లాట్లు దక్కించుకున్న వారికి వెంటనే అలాట్‌మెంట్ ఆర్డర్లు అందజేశారు. ఈ సందర్భంగా వీఎంఆర్‌డీఏ కార్యదర్శి టి.వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం నిబంధనల మేరకు గజం ధర రూ.9 వేలుగా నిర్ణయించినట్లు తెలిపారు. వీటిని దక్కించుకున్న వారు మూడు పనిదినాల్లో ప్లాట్ ధరలో 10 శాతం చెల్లింపులు తప్పనిసరిగా చేయాలని సూచించారు. మిగిలిన 90 చెల్లింపులు మూడు సులభ వాయిదాల్లో (ప్రతి రెండు నెలలకు ఒక వాయిదా చొప్పున) చెల్లించే అవకాశం కల్పించినట్లు చెప్పారు. అలాగే ఈ కేటాయింపుదారుల వివరాలను వీఎంఆర్‌డీఏ వెబ్‌సైట్‌లోను, కార్యాలయం నోటీస్ బోర్డులో పొందుపర్చినట్లు తెలిపారు. ఈ లాటరీలో కేటాయింపులు జరగని 118 దరఖాస్తుదారులకు ఈఎండీ సొమ్మును వెనక్కు ఇచ్చినట్లు వెల్లడించారు. మిగిలిన వారు కార్యాలయం 8వ అంతస్తులో అలాట్‌మెంట్ సెక్షన్‌లో ఆధార్, టోకెన్ నెంబర్‌తో వచ్చి చెక్కు రూపంలో డబ్బును పొందవచ్చన్నారు. రిజర్వ్డ్ కేటగిరీ వారికి 15 రోజుల్లో ఈఎండీ చెల్లింపులు చేయడం జరుగుతుందన్నారు. చీఫ్ అర్బన్ ప్లానర్ ప్రభాకర్, ఎస్ఈ భవానిశంకర్, అకౌంట్స్ ఆఫీసర్ నిర్మలమ్మ పాల్గొన్నారు.

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం రూ.18.86 లక్షలు

సీతమ్మధార (విశాఖ ఉత్తర): ఆశీలమెట్టలో శ్రీసంపత్ వినాయగర్ దేవాలయం హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించారు. 21 రోజులకుగాను రూ.18,86,916 లక్షలు, 23.700 గ్రాముల బంగారం, 198 గ్రాముల వెండి, 109 యూఎస్‌ఏ డాలర్స్, 100 సింగపూర్ డాలర్స్, 5 ఇంగ్లండ్ పౌండ్స్, 50 ఇండోనేషియా రింగిట్స్, 5 యూరోలతో పాటు 111 చెక్కులు వచ్చినట్లు ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టి.ఆర్.చోళన్ తెలిపారు. శివజ్యోతి, శ్రీవెంకటేశ్వర సేవా సంఘం సభ్యులు ఆదాయాన్ని లెక్కించారు.

విద్యుత్ చౌర్యంపై విజిలెన్స్



- నిరంతర దాడులు నిర్వహిస్తున్న ఏపీఈపీడీసీఎల్
- ఏడాది కాలంలో రూ. 5.02 కోట్ల జరిమానాలు
- ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ప్రణాళికలు
- సిబ్బంది నిర్లక్ష్యంపైనా కేసులు నమోదు

సాక్షి, విశాఖపట్నం : అక్రమార్కుల చర్యలతో విద్యుత్ శాఖకు జరుగుతున్న నష్టంపై విజిలెన్స్ ఉక్కుపాదం మోపుతోంది. చౌర్యానికి పాల్పడుతున్న వినియోగదారులపై కొరడా ఝుళిపిస్తూ.. కోట్ల రూపాయల అపరాధ రుసుము వసూలు చేస్తోంది. ఆకస్మిక తనిఖీలు చేస్తూ అనధికారికంగా విద్యుత్ వాడుతున్న వారి సంఖ్య గణనీయంగా తగ్గించే చర్యలకు ఉపక్రమించింది. ఓ వైపు విద్యుత్ దొంగలను పట్టుకుంటూ.. విద్యుత్ శాఖలో ఉన్న పని దొంగలపైనా తనదైన శైలిలో చెక్ పెడుతోంది.

ప్రజలకు నాణ్యమైన విద్యు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా విద్యుత్ చౌర్యం, అక్రమ విద్యుత్ వినియోగం కారణంగా వినియోగదారులకు పూర్తిస్థాయిలో విద్యుత్‌సేవలు అందించలేకపోతున్న విషయం గుర్తించిన సీఎం వైఎస్ జగన్.. వాటి నియంత్రణపై దృష్టి సారించాలని డిస్కమ్‌లని ఆదేశించారు. **ఈ నేపథ్యంలో తూర్పు విద్యుత్ పంపిణీ సంస్థ(ఈపీడీసీఎల్) పరిధిలో విజిలెన్స్ అధికారులు దూకుడు ప్రదర్శిస్తున్నారు. అక్రమ విద్యుత్ వినియోగం, చౌర్యం, పర్మిషన్ లేని ఓవర్ లోడ్ విని**యోగం, మీటర్ల ట్యాంపరింగ్ వంటి అక్రమాల అంతు తేల్చే పనిలో నిమగ్నమయ్యారు. ఏడాది కాలంగా ఈపీడీసీఎల్ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు సర్కిల్స్ పరిధిలో విజిలెన్స్ దాడులు విస్తృతంగా నిర్వహించారు. 2022-23కి సంబంధించిన వార్షిక నివేదికని ఆయన విడుదల చేశారు. పరిధిలో 2022 జనవరి 1 నుంచి డిసెంబర్ 24 వరకూ నిర్వహించిన దాడుల్లో ఆపరేషన్ వింగ్, డీపీఈ వింగ్ సహకారంతో మొత్తం 6,385 కేసులు నమోదు చేశారు. ఈ కేసులకు సంబంధించి అసెస్మెంట్, కాంపౌండింగ్ రుసుము కింద రూ.5.02 కోట్లు వసూలు చేశారు. విజిలెన్స్ సిబ్బంది నిరంతరం క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహిస్తూ విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుంటున్నారు. 2022లో 277 క్వాలిటీ కేసుల్ని విజిలెన్స్ సిబ్బంది నమోదు చేసి రూ.3.38 కోట్లు అపరాధ రుసుం వసూలు చేశారు.

నిర్లక్ష్య సిబ్బందిపైనా చర్యలు

విద్యుత్ సేవలు మరింత మెరుగు పరిచేందుకు విద్యుత్ సిబ్బంది పనితీరు కూడా ఒక ప్రామాణికంగా భావిస్తున్న విజిలెన్స్ ఆ దిశగానూ చర్యలకు **ఉపక్రమిస్తోంది. విద్యుత్** శాఖ ఉద్యోగులపై వచ్చిన **ఆరోపణలపై విచారణలు** వేగవంతం చేస్తోంది. **వినియోగదారులకు అందాల్సిన** సేవల విషయం**లో నిర్లక్ష్యం వహిస్తున్న** సిబ్బందిపై వచ్చిన ఫిర్యాదుల్ని క్షేత్ర స్థాయిలో విచారణ చేపడుతోంది. గతేడాది కాలంలో విద్యుత్ ఉద్యోగులపై 83 పిటిషన్లు రాగా.. ఇందులో 58 పిటిషన్లపై విచారణ పూర్తి చేసి శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ఈపీడీసీఎల్ సీఎండీకి విజిలెన్స్ అధికారులు నివేదికలు అందించారు.

1912కి ఫిర్యాదు చేయండి



ఏపీఈపీడీసీఎల్ పరిధిలో కొంత కాలంగా ట్రాన్స్‌ఫార్మర్లని దొంగిలించడం వంటి ఘటనలు జరుగుతున్నాయన్న ఫిర్యాదులపై దృష్టిసారించారు. నైట్ పెట్రోలింగ్‌తో వీటిని నివారించాం. అదే విధంగా హెచ్‌టీ లైన్స్‌పై స్పెషల్ రైడ్స్ నిర్వహిస్తున్నాం. మరమ్మతులు నిర్ణీత కాలంలో నిర్వహించని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని నివేదికలు ఇస్తున్నాం. విద్యుత్‌కు సంబంధించిన పనులు చేయిస్తాం. వ్యవసాయ బోరుకు కనెక్షన్లు ఇప్పిస్తామని ఎవరైనా మోసం చేయాలని చూస్తే విజిలెన్స్‌కు ఫిర్యాదు చేయవచ్చు. ప్రజలంతా విద్యుత్‌ని పొదుపుగా వాడాలని, సమస్య పరిష్కరించేందుకు సిబ్బంది ఎవరైనా డబ్బులు అడిగినా 1912 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.

– ఏపీఎల్ ప్రసన్నకుమార్, ఈపీడీసీఎల్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్

ఏపీడీసీఎల్ పరిధిలో 2022లో విద్యుత్ చౌర్యం కేసులు

నెల	నమోదైన కేసులు	వసూలు చేసిన మొత్తం
జనవరి	499	40,27,450
ఫిబ్రవరి	631	54,55,731
మార్చి	665	52,89,902
ఏప్రిల్	534	59,11,105
మే	560	39,54,615
జూన్	554	33,78,834
జులై	523	37,42,070
ఆగస్ట్	475	43,09,710
సెప్టెంబర్	618	41,81,245
అక్టోబర్	495	28,59,718
నవంబర్	440	35,82,597
డిసెంబర్ 24 వరకు	391	35,67,472
మొత్తం	6385	5,02,60,449

ఎన్ఐపీలోకి హెచ్‌పీవీ వ్యాక్సిన్



బాలికలకు వ్యాక్సిన్ అందిస్తున్న మంత్రి రజని, కలెక్టర్ మల్లికార్జున, మేయర్ హరివెంకట కుమారి

- కేంద్రానికి సీఎం జగన్ సిఫారసు చేశారు
- మంత్రి విడదల రజని వెల్లడి

ఎంవీపీకాలనీ(విశాఖ తూర్పు): జాతీయ రోగ నిరోధక ప్రోగ్రాం(ఎన్ఐపీ)లోకి హెచ్‌పీవీ వ్యాక్సిన్ చేరనుందని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని వెల్లడించారు. గ్లోబల్ హెల్త్ సమ్మిట్‌లో భాగంగా ఎంవీపీకాలనీలోని మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రిలో శనివారం హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి రజని ముఖ్య అతిథిగా పాల్గొని బాలికలకు వ్యాక్సినేషన్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం మహిళల్లో గర్భాశయ క్యాన్సర్ లక్షణాలు ఎక్కువగా కనిపిస్తున్నాయన్నారు. తన నియోజకవర్గంలో నిర్వహించిన సర్వేలో 200 మంది బాలికలకు ఈ లక్షణాలు ఉన్నట్లు తేలిందన్నారు. ఇదే పరిస్థితి అన్ని చోట్ల ఉందన్నారు. గర్భాశయ క్యాన్సర్‌కు అడ్డుకట్ట వేయడానికి ముందస్తు హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ మంచి పరిష్కారమన్నారు. ఈ నేపథ్యంలోనే హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌ను నేషనల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రాంలో చేర్చాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి సూచించినట్లు చెప్పారు. త్వరలోనే ఇది సాకారం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అప్పి ఇండియా ఫౌండేషన్ ద్వారా మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి యాజమాన్యం నగర బాలికలకు 200 డోసుల వ్యాక్సిన్ అందించడం అభినందనీయమన్నారు. అప్పి ఫౌండేషన్ యూఎస్‌ఏ అధ్యక్షుడు డాక్టర్ కొల్లి రవి మాట్లాడుతూ హెచ్‌పీవీ ముందస్తు వ్యాక్సినేషన్ ద్వారా 90శాతం గర్భాశయ క్యాన్సర్‌ను అరికట్టవచ్చన్నారు. 6వ తరగతి నుంచి 8వ తరగతి మధ్య బాలికలకు ఆరు నెలల వ్యవధిలో రెండు డోసుల వ్యాక్సిన్ అందించాల్సి ఉంటుందన్నారు. ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, కలెక్టర్ మల్లికార్జున, ఆస్పత్రి ఎండీ డాక్టర్ మురళీకృష్ణ, డీఈవో చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట



చేపల మార్కెట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు, చిత్రంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, కలెక్టర్ మల్లికార్జున



కుళాయిని పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

- మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు
- ఆధునిక చేపల మార్కెట్ భవనం ప్రారంభం

మహారాణిపేట (విశాఖ దక్షిణ): మత్స్యకారుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తోందని రాష్ట్ర మత్స్య, పాడి, పశుగణాభివృద్ధి శాఖ మంత్రి డా.సీదిరి అప్పలరాజు అన్నారు. శనివారం విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో రూ.2.75 కోట్లతో నిర్మించిన ఆధునిక చేపల మార్కెట్ భవనాన్ని మంత్రి అప్పలరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ ఆధునిక పరిశుభ్రమైన చేపల మార్కెట్ భవనం ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందని, 116 మంది మత్స్యకారులు చేపలు అమ్ముకునేందుకు వీలుగా భవనం నిర్మించామన్నారు. ఈ మార్కెట్ ఫిషరీస్ డిపార్టుమెంటు అనుసంధానంతో నిర్వహిస్తారని తెలిపారు. మత్స్యకార భరోసా, మోటర్ బోట్లకు డీజిల్ సబ్సిడీ వంటి పథకాలతో ఎంతోమంది మత్స్యకారులు లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. డొమెస్టిక్ ఫిష్ మార్కెటింగ్, కేజ్ కల్చర్, లైవ్ ఫిష్ వెండింగ్ యూనిట్లు మొదలుపెట్టే వారికి ప్రభుత్వం సబ్సిడీ, స్థలం మంజూరు చేసి ప్రోత్సహిస్తామన్నారు.

జిల్లా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ సుమారు 10,000 కుటుంబాలు ఫిషింగ్ హార్బర్‌లో చేపలు, రొయ్యలు విక్రయాలు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారని, వాటిని విక్రయించేందుకు స్థలం శుభ్రంగా ఉండడం లేదని విక్రయదారులు అభిప్రాయం వ్యక్తం చేశారన్నారు. అందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధునిక పరిశుభ్రమైన చేపల మార్కెట్ నిర్మించిందన్నారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ ఎంతోకాలంగా మత్స్యకారులు ఎదురుచూస్తున్న ఆధునిక పరిశుభ్రమైన చేపలమార్కెట్ భవనం ప్రారంభించామన్నారు. దీనిని మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు, ఫిషరీస్ జేడీ టి.సుమలత, ఫిషరీస్ కార్పొరేషన్ డైరెక్టర్ విజయ్ చంద్ర, మెకనైజ్డ్ బోట్ అసోసియేషన్ అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్, ప్రతినిధులు బర్రి కొండబాబు, వార్డ్ కార్పొరేటర్లు మత్స్యకార మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల పట్ల చంద్రబాబుకు సదాభిప్రాయం లేదు

మత్స్యకారుల పట్ల చంద్రబాబు నాయుడుకు ఎప్పుడు సదాభిప్రాయం లేదని, ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. టీడీపీ హయాంలో మత్స్యకారులు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యారన్నారు. మత్స్యకారులు అంటే చంద్రబాబు చులకనగా చూసేవారని, మమకారం లేదని, ఆదరణ చూపలేదని విమర్శించారు. మత్స్యకారుల సంక్షేమానికి, అభ్యున్నతికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఎన్నో పథకాలు చేపట్టారన్నారు. ఈ రోజు సిదిరి అప్పలరాజు మంత్రి అయ్యారంటే సీఎం జగన్ చలవే అని అన్నారు.

కొత్తపెంటలో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ



ఆధ్యాత్మిక ప్రవచనాలు చేస్తున్న స్వామీజీలు, పీఠాధిపతులు



అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తజనం

- వైభవంగా దేవానంద స్వామీజీ ఆరాధన మహోత్సవం
- దేశ నలుమూలల నుంచి హాజరైన పీఠాధిపతులు, సాధు సత్పురుమలు



దేవానంద స్వామీజీ విగ్రహాన్ని దర్శించుకున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: కొత్తపెంటలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. ఇక్కడ స్వామీజీ ఆశ్రమంలో సద్గురు దేవానంద సరస్వతీ మహారాజ్ (రుషీకేష్) 23వ ఆరాధన మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ మహోత్సవానికి రాష్ట్ర నలుమూలల నుంచి పీఠాధిపతులు, సాధు సత్పురుషులు, స్వామీజీ భక్తులు, శిష్యులు వేలాదిగా తరలిరావడంతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. తెల్లవారుజాము నుంచి సుప్రభాతం, నగర సంకీర్తన, భగవద్గీత పారాయణం, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి విష్ణుదేవానంద సరస్వతీ ఆధ్యాత్మిక సభకు అధ్యక్షత వహించగా, విశాఖ జిల్లా వడ్లపూడి ఆనందాశ్రమం పీఠాధిపతి రామకృష్ణానంద ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. శ్రీకాకుళం జిల్లా మొయిదంలోని శివానంద ధర్మక్షేత్రం బ్రహ్మచారి ప్రకాశానంద, స్వామి స్థిత ప్రజ్ఞానంద సరస్వతీ, మహేంద్ర పట్నాయక్ తదితర స్వామీజీల ఆధ్యాత్మిక ప్రవచనాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

దేవానంద స్వామీజీకి డిప్యూటీ సీఎం బూడి పూజలు..

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, రమణమ్మ దంపతులు వేర్వేరుగా దేవానంద స్వామీజీ విగ్రహానికి పూలమాలలు వేసి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. వేలాదిగా హాజరైన భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి సత్యం, వైస్ ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, కొత్తపెంట సర్పంచ్ రొంగలి నీలిమవెంకటరావు, మాజీ సర్పంచ్ రొంగలి శంకరరావు, దేవానంద స్వామీజీ ఆధ్యాత్మిక జీవన సంఘం అధ్యక్షుడు కర్రి దేముడు, కోశాధికారి లెక్కల గంగునాయుడు, కార్యదర్శి పి.ఎస్.కె. నరసింగరావు, ఉప కోశాధికారి సిహెచ్. నాగభూషణం పాల్గొన్నారు.

జీవితకాలం పెరుగుదలతో క్యాన్సర్‌కు దోహదం



- 50 ఏళ్లు దాటితే పరీక్షల ద్వారా గుర్తించే అవకాశం
- విలేజి క్లినిక్ కాన్సెప్ట్‌తో ఈ రోగులకు ప్రయోజనం
- 'సాక్షి'తో యూఎస్ క్యాన్సర్ నిపుణుడు రఘు కల్లూరి

సాక్షి, విశాఖపట్నం: మనుషుల జీవితకాలం పెరుగుదల క్యాన్సర్ వ్యాధికి దోహదం చేస్తోందని అధ్యయనాల్లో తేలినట్టు అమెరికాలోని క్యాన్సర్ వ్యాధి నిపుణుడు రఘు కల్లూరి తెలిపారు. అందుకే క్యాన్సర్ ఏజింగ్ డిసీజ్‌గా మారుతోందన్నారు. ఏపీపీఐ గ్లోబల్ హెల్త్ సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన ఆయన శనివారం 'సాక్షి'తో మాట్లాడారు. వైద్యరంగంలో పెరుగుతున్న విజ్ఞానంతో మనిషి సగటు ఆయుష్షును పెంచగలుగుతున్నా, వ్యాధులను తగ్గించలేకపోతున్నామని చెప్పారు. 50 ఏళ్లు దాటిన వారిలో వ్యాధి నిరోధక శక్తి సన్నగిల్లుతుందని, అలాంటి వారికి క్యాన్సర్ సోకే అవకాశాలు పెరుగుతున్నాయని తెలిపారు. గతంలో మనిషి సగటు జీవితకాలం 50 ఏళ్లే ఉండడంతో దాని బారినపడే వారి సంఖ్య తక్కువగా ఉండేదని వివరించారు. అందువల్ల 50 ఏళ్లు పైబడిన వారు క్యాన్సర్ లక్షణాలున్నా, లేకపోయినా కొలనోస్కొపీ పరీక్షలు చేయించుకోవడం ద్వారా క్యాన్సర్ పరిస్థితిని ముందుగా గుర్తించే వీలుంటుందన్నారు. ఫలితంగా క్యాన్సర్ తీవ్రతకు అడ్డుకట్ట వేయడం ద్వారా మరణాలను తగ్గించవచ్చని చెప్పారు. మంచి ఆహారపు అలవాట్లు, మితాహారం, మాంసాహారాన్ని తగ్గించడం, పరిశుభ్ర వాతావరణంలో నివశించడం, బరువు తగ్గడం, కాలుష్య ప్రభావానికి దూరంగా ఉండడం క్యాన్సర్ బారినపడకుండా ఉండేందుకు దోహదపడతాయని తెలిపారు.

విలేజీ క్లినిక్ కాన్సెప్ట్‌తో మేలు

గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగు పరచడం ద్వారా కూడా క్యాన్సర్ ఉధృతిని తగ్గించవచ్చని డాక్టర్ రఘు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన విలేజ్ క్లినిక్ కాన్సెప్ట్ ఎంతో మేలు చేస్తుందన్నారు. ఈ కాన్సెప్ట్‌లో జీవనశైలిలో మార్పులపై కూడా అవగాహన కల్పించాలని సూచించారు. కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఇమ్యునోథెరపీ క్యాన్సర్ నిరోధంలో మంచి ఫలితాలిస్తోందని తెలిపారు. దీనికి 30-70 వేల డాలర్ల ఖర్చవుతున్నందున సామాన్యులకు అందుబాటులో ఉండడం లేదని చెప్పారు.

శిక్షాప్రాతిశాఖ్య గ్రంథావిష్కరణ



శిక్షాప్రాతిశాఖ్య గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీవిజయేంద్ర

బీచ్‌రోడ్డు: భద్రాచల దేవస్థాన రామాయణ పారాయణదారులు ఎస్‌టీజీ కృష్ణమాచార్యులు రచించిన చతుర్వేద వేదాల శిక్షా ప్రాతిశాఖ్య గ్రంథాన్ని శనివారం ఆవిష్కరించారు. గ్రంథాన్ని కంచిపీఠాధిపతులు శ్రీవిజయేంద్ర స్వామికి అందజేశారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం దేవస్థాన సామవేదపండితులు డీఎస్‌ఎస్ సన్యాసిశర్మఘనపాఠి, రచయిత కృష్ణమాచార్యులు, శాస్త్ర పండితులు ఓరుగంటి రామలాల్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాస రావు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా జి-20 సదస్సు

మున్సిపల్ ప్రత్యేక కార్యదర్శి శ్రీలక్ష్మి



మాట్లాడుతున్న మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రత్యేక కార్యదర్శి శ్రీలక్ష్మి

డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): విశాఖలో మార్చిలో నిర్వహించనున్న జి-20 సదస్సుకు ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రత్యేక కార్యదర్శి వై. శ్రీలక్ష్మి వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. ప్రతిష్టాత్మకంగా జి-20 సదస్సు నిర్వహించాలన్నారు. వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు, పోలీస్ కమిషనర్ శ్రీకాంత్, ఇతర ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో జి-20 సదస్సుపై శనివారం ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మీ మాట్లాడుతూ మార్చి 28, 29 తేదీల్లో ప్రతిష్టాత్మకంగా జరగనున్న జి-20 సదస్సుకు ఏర్పాట్లు చేయాలని, ముఖ్యంగా ఏ శాఖకు సంబంధించిన పనులు వారు పూర్తి బాధ్యతతో చేయాలన్నారు. సుమారు 40 దేశాల నుంచి ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరుకానున్నారని, వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పర్యాటక ప్రాంతాల్లో ప్రముఖులు పర్యటించనున్న నేపథ్యంలో అరకు, బొర్రా గుహలు, శిల్పారామం, కైలాసగిరి, ఆర్కే బీచ్, వీఎంఆర్‌డీఏ-స్మార్ట్ సిటీ పార్కు తదితర ప్రాంతాలను ఆధునీకీకరించి, అందంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. అతిథులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా ప్రోటోకాల్ ప్రకారం వసతి ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరంలో ఎక్కడా ట్రాఫిక్‌కు అంతరాయడం కలగకుండా చూడాలని, వారికి తగిన భద్రత కల్పించాలని పోలీస్ శాఖ అధికారులను ఆదేశించారు. పారిశుధ్యం, నగర సుందరీకరణ, విద్యుత్, రోడ్ల మరమ్మతు వంటి పనులు జీవీఎంసీ యంత్రాంగం పర్యవేక్షించాలని కమిషనర్‌ను ప్రత్యేక కార్యదర్శి శ్రీలక్ష్మి ఆదేశించారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఉన్నతాధికారులు, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, వీఎంఆర్‌డీఏ అధికారులు, డీఆర్డీ అధికారులు, డీఎం అండ్‌హెచ్‌వో, గిరిజన కార్పొరేషన్ అధికారులు, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఏయూ మైదానంలోనే వాల్తేరు వీరయ్య ప్రీ రిలీజ్



చిరంజీవి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న అభిమానులు

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): మెగాస్టర్ చిరంజీవి నటించిన వాల్తేరు వీరయ్య చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకు వేదిక విషయంలో రెండు రోజులుగా నెలకున్న సందిగ్ధత తొలగిపోయింది. ఏయూ మైదానంలోనే వేడుక నిర్వహించేందుకు పోలీసులు అనుమతులిచ్చారు. ముందు ఆర్కే బీచ్‌లో వేడుకలు నిర్వహించాలని ఏర్పాట్లు చేశారు. అయితే ప్రభుత్వం జీవో నంబర్-1 విడుదల చేయడంతో వేదిక మార్చుకోవాలని పోలీసులు సూచించారు. దీంతో ఏయూ మైదానంలో వేడుక నిర్వహించేందుకు అనుమతులు ఇవ్వాలని నిర్వాహకులు సీపీ శ్రీకాంత్‌కు విజ్ఞప్తి చేశారు. ఇందుకు పోలీసులు కూడా అనుమతులు మంజూరు చేశారు. అయితే శనివారం ఉదయం తిరిగి ఆర్కేబీచ్‌లో వేడుకలు నిర్వహించేందుకు అనుమతులు వచ్చాయంటూ ఏర్పాట్లు పునఃప్రారంభించారు. శనివారం మధ్యాహ్నంగా మూడో పట్టణ సీఐ రామారావు ఆర్కే బీచ్‌కు చేరుకొని అనుమతులు లేకుండా ఏర్పాట్లు ఎలా చేస్తారని, తక్షణం నిలిపివేయాలని ఆదేశించారు. దీంతో అసలు ప్రీ రిలీజ్ వేడుక ఎక్కడ నిర్వహించాలో తెలియక అటు నిర్వాహకులు, ఇటు అభిమానులు ఆందోళన చెందారు. చివరికి ఏయూ గ్రౌండ్స్‌లోనే ప్రీ రిలీజ్ వేడుకలను నిర్వహించేందుకు పోలీసులు అనుమతులు ఇవ్వడంతో ఏర్పాట్లు చేస్తున్నారు.

వాల్తేరు వీరయ్యకు క్షీరాభిషేకం

సంక్రాంతికి వాల్తేరు వీరయ్య చిత్రం విడుదల కానుండంతో మెగాస్టార్ చిరంజీవి చిత్ర పటానికి శనివారం సాగరతీరంలో అభిమానులు క్షీరాభిషేకం నిర్వహించారు. శనివారం విడుదలైన చిత్రం టీజర్ అభిమానల్లో పూనకాల రప్పించింది. చిరంజీవి కట్ అవుట్ పట్టుకొని సాగరతీరంలో అభిమానులు సందడి చేశారు.

ముగిసిన ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఇంటిలిజెన్స్ ఏఎస్‌పీ వెంకటరావు

మురళీనగర్ (విశాఖ ఉత్తర): ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఇంటిలిజెన్స్ ఏఎస్‌సీ ఎస్.వెంకటరావు పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు. విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి చూపాలని ఏఎస్పీ సూచించారు. తల్లిదండ్రులు వారి పిల్లలను క్రీడల్లో పాల్గొనే విధంగా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో తుమ్మిడి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ తుమ్మిడి రామ్‌కుమార్, టెక్నికల్ ఎడ్యుకేషన్ పూర్వ జేడీ డాక్టర్ ఎస్‌పీయూఎం ప్రసాద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు ఏనుగుతునిలో 'గడప గడపకు'

కశింకోట: మండలంలోని ఏనుగుతుని గ్రామంలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ప్రారంభమవుతుందని ఎంపీపీ కలగా లక్ష్మి, ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ముఖ్య అతిథిగా హాజరై ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి లబ్ధిదారులకు వివరిస్తారని, ప్రజా సమస్యలు తెలుసుకొని పరిష్కరించడానికి చర్యలు చేపడతారన్నారు. ప్రజలు, అభిమానులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

30న అనకాపల్లికి బహుజన చైతన్య యాత్ర

అనకాపల్లిటౌన్: దేశవ్యాప్తంగా జరుగుతున్న బహుజన రాజ్యాధికార చైతన్య యాత్ర ఈ నెల 30 అనకాపల్లి రానున్నట్టు బీఎస్పీ జిల్లా కన్వీనర్ ఎస్.వి.వి.రామచంద్రరావు శనివారం తెలిపారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం, రాజ్యాధికారాన్ని సాధిద్దాం అనే నినాదంతో ఈ యాత్ర సాగుతున్నట్టు పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీల అభ్యున్నతికి కృషి చేయాలని ఆయన కోరారు.

చైన్‌మ్యాన్ జాన్‌కు ఘన నివాళి



జాన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

తుమ్మపాల: ఏడీ సర్వే, భూ రికార్డ్స్ కార్యాలయంలో పని చేస్తున్న చైన్‌మ్యాన్ జాన్(25) ఆకస్మిక మరణంపై కలెక్టర్ కార్యాలయంతో పాటు ఇతర జిల్లా కార్యాలయాల్లో నాల్గో తరగతి ఉద్యోగులు శనివారం సంతాపం తెలిపారు. జాన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

వామనావతారంలో వేంకటేశ్వరస్వామి

కశింకోట: స్థానిక గవరపేట ఆలయంలో వేంకటేశ్వరస్వామి వామనావతార అలంకరణలో శనివారం భక్తులకు దర్శనమిచ్చారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా స్వామిని విష్ణుమూర్తి దశావతారాల్లో ఒకటైనవామనునిగా అలంకరించారు. భక్తులు దర్శించి పూజలు చేశారు.

బెల్లం ధరలు

అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 8,682 బెల్లం దిమ్మలు వచ్చాయి

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,550	3,960
మొదటి రకం	3,270	3,600
రెండో రకం	3,080	3,440
మూడో రకం	2,960	3,100

అనకాపల్లి సినిమాలు

ధమాకా	-రాజా
ప్రత్యర్థి	-సత్యనారాయణ స్క్రీన్-1
అవతార్-2	-సత్యనారాయణస్క్రీన్-2
18 పేజెస్	-షిర్డిసాయి
అవతార్-2	-పర్తిసాయి
కింగ్‌డమ్ ఆఫ్ డైనోసార్స్(తెలుగు)	-వెంకటేశ్వర
లవ్ టుడే	-శ్రీసత్య
అవతార్-2	-రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 75 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-14 యూనిట్లు, ఏ నెగిటివ్-2 యూనిట్లు, బి పాజిటివ్-8 యూనిట్లు, బి నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్ 46 యూనిట్లు, ఏబీ పాజిటివ్ -4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్ బ్యాంకు ప్రతినిధి గంగయ్య (ఫోన్ నంబర్ 9182834480)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 483 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారికి 469 మందికి సిలెండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (ఫోన్ నంబర్9441108144)ని సంప్రదించవచ్చు.

అభివృద్ధి చూసి జీర్ణించుకోలేకే విమర్శలు

- మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- జమాదులపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం



జగనన్న లే-అవుట్ శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్



డ్వాక్రా మహిళలకు సంక్షేమ పథకాల చెక్కు అందజేస్తున్న మంత్రి అమర్‌నాథ్

కశింకోట: రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు మరింత చేరువయ్యారని, దీన్ని జీర్ణించుకోలేకే విపక్షాలు లేనిపోని విమర్శలు చేస్తున్నాయని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మండిపడ్డారు. మండలంలోని జమాదులపాలెం కాలనీలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి ఇంటింటికీ వెళ్లి మంత్రి వివరించారు. ఈ సందర్భంగా పలువురు మంగళ హారతులిచ్చి, పూలమాలలు వేసి, దుశ్శాలువాలతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాల విషయంలో రాష్ట్ర ప్రజలు ఎంతో ఆనందంగా, సంతృప్తిగా ఉన్నారన్నారు. సాంకేతిక కారణాల వల్ల పథకాలు అందని అర్హులకు సచివాలయ సిబ్బంది సహకరించి, లబ్ధి చేకూర్చడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రంగబోలు జలాశయం పరిశీలన

జమాదులపాలెం గ్రామ శివారులో ఉన్న రంగబోలు గెడ్డ జలాశయాన్ని మంత్రి పరిశీలించారు. సుమారు 750 ఎకరాలకు సాగునీరు అందిస్తున్న జలాశయం అభివృద్ధికి చేపట్టవలసిన చర్యలపై స్థానికులతో చర్చించారు. హైస్కూల్‌ను సందర్శించి అక్కడ నాడు-నేడు కింద చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. తమకు అందుతున్న ప్రభుత్వ పథకాల వివరాలతో కూడిన ప్లకార్డులతో మంత్రికి విద్యార్థులు స్వాగతం పలికారు. గ్రామంలో కాలువలు, రోడ్లు నిర్మించాలని స్థానికులు మంత్రిని కోరగా, సాధ్యమైనంత తొందరలో నిర్మించాలని సిబ్బందిని ఆదేశించారు.

జగనన్న కాలనీకి శంకుస్థాపన

వైఎస్సార్ జగనన్న కాలనీకి మంత్రి శంకుస్థాపన చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. 134 మందికి స్థలాలు మంజూరు చేశామని, వీటిని సత్వరమే నిర్మించుకుని సొంత ఇంటి కల సాకారం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. రూ.20 లక్షలతో సీమలవాక కాలనీకి నిర్మించనున్న సిమెంట్ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. వక్ఫ్ బోర్డు భూములపై సాగు హక్కు కల్పించాలని రైతులు మంత్రికి విజ్ఞప్తి చేయడంతో సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. డ్వాక్రా సంఘాల మహిళలకు గత మూడేళ్లలో అమలు చేసిన పలు పథకాలకు సంబంధించిన రూ.3.62 కోట్ల చెక్కును మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, వైఎస్ ఎంపీపీ నమ్మి మీనా, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిషోర్, ఉపాధ్యక్షుడు కరక సోము నాయుడు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కూండ్రపు అరుణ, అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు, సర్పంచ్‌లు కలగా గున్నయ్యనాయుడు, కరక రాజ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి కరక శేషు, ఎంపీటీసీ సభ్యురాలు గూడుపు లక్ష్మి, ఉప సర్పంచ్ గూడుపు అప్పలనాయుడు, రాష్ట్ర పార్టీ యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, స్థానిక నాయకులు బొట్టా రాజారావు, ఒమ్మి గంగునాయుడు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై రెయిలింగ్ తొలగిస్తే చర్యలు



హెచ్చరిక ఫ్లెక్సీని ఏర్పాటు చేయిస్తున్న సీఐ రవికుమార్

కశింకోట: ప్రమాదాల నివారణకు జాతీయ రహదారి మధ్య డివైడర్లపై అమర్చిన రెయిలింగ్ (గ్రిల్స్)ను అనధికారికంగా తొలగించరాదని, అందుకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అనకాపల్లి గ్రామీణ సీఐ ఎ.రవికుమార్ హెచ్చరించారు. హైవే అథారిటీ సిబ్బందితో కలిసి సీఐ, ఎస్ఐ ఆదినారాయణరెడ్డి జాతీయ రహదారిపై రెయిలింగ్‌ను శనివారం పరిశీలించారు. డివైడర్‌పై అమర్చిన రెయిలింగ్‌ను పలుచోట్ల రాకపోకల కోసం స్థానికులు తొలగించారు. ఆ ప్రాంతాల వద్ద రెయిలింగ్‌ను సీఐ పునరుద్ధరించి, హెచ్చరిక ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. రెయిలింగ్‌ను ఎవరైనా అనధికారికంగా తొలగిస్తే చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా సీఐ హెచ్చరించారు.

రూ.78 లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణం



అదనపు తరగతి గదులకు భూమిపూజ చేస్తున్న కార్పొరేటర్ కొణతాల నీలిమ

అనకాపల్లిటౌన్: నాడు-నేడు పథకంలో ప్రభుత్వం పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయని 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ అన్నారు. గవరపాలెం సంతబయలు ప్రాథమిక పాఠశాలలో రూ.78 లక్షల వ్యయంతో నిర్మించనున్న అదనపు తరగతి గదులకు శనివారం ఆమె భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్య పెరగడంతో పాఠశాల ఆవరణలో అదనపు తరగతి గదులతో పాటు మౌలిక సదుపాయలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఆర్వోప్లాంట్, నూతన మరుగుదొడ్ల నిర్మాణం, ఆటస్థలం అభివృద్ధికి నిధులు ఖర్చుచేస్తున్నట్టు తెలిపారు. అనంతరం మధ్యాహ్నభోజనం వంటకాలను ఆమె రుచి చూశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 80వ వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కరరావు, హెచ్‌ఎం లలిత, వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రి శివనారాయణ, అప్పాజీ, చిన్న, నారాయణ, సతీష్, విద్యాకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి

- జెడ్సీ వెంకటరమణ



జోన్ కమిషనర్ వెంకటరమణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్పొరేటర్ సునీత దంపతులు

అనకాపల్లిటౌన్: జోన్ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్టు బదిలీపై ఇక్కడికి వచ్చిన జెడ్సీ ఎస్.వెంకటరమణ తెలిపారు. శనివారం ఆయన వేల్పుల వీధి, గవరపాలెం, గాంధీ నగరాల్లో పర్యటించి, అక్కడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. జోన్ కమిషనర్‌ను 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

గోదాదేవికి సారె సమర్పణ



భక్తులు సమర్పించిన సారె



గోదాదేవి అమ్మవారికి సారె చూపిస్తున్న మహిళలు

పాయకరావుపేట: పట్టణంలో గల శ్రీరాధారుక్మిణీ సహిత పాండురంగ దేవస్థానంలో గోదాదేవికి శనివారం భక్తులు సారె సమర్పించారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి పండ్లు, స్వీట్లు, పూలు, కొబ్బరికాయలు తదితర సారె సామాగ్రిని వికాస తరంగిణి భక్తులు సమర్పించారు. ఆలయంలో లక్ష్మీ నారాయణ పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు యియ్యుణ్ణి కృష్ణస్వామి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నరిసే వెంకటేశ్వరరావు భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు.

రెండు కార్లు ఢీ



ప్రమాదానికి గురైన కారు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వద్ద జాతీయ రహదారిపై రెండు కార్లు శనివారం ఢీకొన్నాయి. అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి హానీ జరగలేదు. యలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వెళుతున్న కారును అదే మార్గంలో వెనుకగా వస్తున్న మరో కారు ఢీకొంది. దీంతో రెండు కార్లు దెబ్బతిన్నాయి.

డ్రైవర్లతో పాటు మరొకరు ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. కార్లలో ఒకటి విశాఖ, మరొకటి విజయనగరానికి చెందినవి. ఈ ప్రమాదంలో నిర్లక్ష్యంగా డ్రైవ్‌చేసిన వెనుక కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఆదినారాయణరెడ్డి తెలిపారు.

కిశోర బాలికల ఆరోగ్యంపై అవగాహన



మండల సమాఖ్య మందిరంలో అవగాహన సమావేశం

ఎస్.రాయవరం : కిశోర బాలికలు రక్తహీనత, ఇతర ఆరోగ్య సమస్యలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సర్వసిద్ధి పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ అనూష అన్నారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు మండల సమాఖ్య కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల, ఐకేపీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిశోర బాలికలకు అందించాల్సిన పోషకాహారం, ఇతర సమస్యల పరిష్కారానికి కావాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఏపీఎం కె.శివప్రసాద్ మాట్లాడుతూ కిశోర బాలికలకు, బాలికల తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకు గ్రామాలవారీగా గ్రామ సమాఖ్య సభ్యులు, స్వయం సహాయం సంఘాల సభ్యులతో సమావేశాలు నిర్వహిస్తామన్నారు.

టెన్త్ విద్యార్థులను టీవీ, ఫోన్లకు దూరంగా ఉంచండి

ఎస్.రాయవరం : పరీక్షలకు వెళ్లే విద్యార్థులను ఇళ్లలో టీవీ, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచాలని దార్లపూడి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాంతి ప్రసూన అన్నారు. పాఠశాలలో శనివారం పదో తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. మార్చి నెలలో విద్యార్థులకు 10వ తరగతి పరీక్షలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణత సాధించడమే కాకుండా మంచి మార్కులు వచ్చే విధంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. విద్యార్థులు చదివే చదువు వారికి పూర్తి ఫలితం ఇవ్వాలంటే ఇంటి వద్ద తల్లిదండ్రులు సహకారం కూడా అవసరం అన్నారు. ఇప్పుడు ప్రతి ఇంట్లో టీవీ, ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లు ఉన్నాయని, పిల్లలు ఎక్కువగా వాటిని చూస్తున్నారన్నారు. అయితే పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులను చదువు వైపు దృష్టి మరలేలా చూడాలన్నారు.

జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు 90 పనిదినాల సొమ్ము



సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధి హామీ పథకం ఏపీడీ మణికుమార్

కశింకోట: వైఎస్సార్ జగనన్న కాలనీ లే-అవుట్లలో ఇళ్లు పొందిన లబ్ధిదారులకు ఒక్కొక్కరికీ 90 పనిదినాల సొమ్మును అందజేయనున్నట్టు ఉపాధి హామీ పథకం ఏపీడీ మణికుమార్ తెలిపారు. కశింకోట మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ కలగా లక్ష్మి అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల పరిషత్ సర్వ సభ సమావేశంలో ఆయన మాట్లాడారు. గృహ నిర్మాణ లబ్ధిదారునికి రోజుకు రూ.250 చొప్పున 90 రోజులకు అందజేస్తామన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో గ్రామ సభల్లో ఆమోదించే ఉపాధి పథకం పనులకు మండల పరిషత్ సమావేశాల్లోను ఆమోదం పొందాలన్నారు. తహసీల్దార్ బి.సుధాకర్ మాట్లాడుతూ మండలంలో భూముల రీ-సర్వే దాదాపు పూర్తి కావస్తోందని, సర్వే పూర్తి అయిన గ్రామాల్లో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. అడ్డాం, చెరకాం గ్రామాల్లో నిర్వహించిన సర్వేలో తప్పులు చోటు చేసుకున్నాయని, వీటిని సవరించాలని చెరకాం సర్పంచ్ వెన్నెల దేముళ్లు తదితరులు కోరారు. తమ సిబ్బందిని పంపించి చర్యలు చేపడతామని తహసీల్దార్ బదులిచ్చారు. కొన్ని గ్రామాల్లో రద్దు చేసిన గృహ నిర్మాణ కాలనీలకు కొత్తగా స్థలాలను గుర్తించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. వెలుగు ఏపీఎం ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ నెల 26న డ్వాక్రా సంఘాలకు 3వ విడత రుణ మాఫీ సొమ్మును ఆన్‌లైన్ ద్వారా మంజూరు చేయనున్నట్టు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎం.పావని మాట్లాడుతూ జల్‌జీవన్ పథకం కింద రూ.4.5 కోట్లతో 17 గ్రామాల్లో ఇంటింటికీ కుళాయిలు ఇవ్వడానికి, మంచినీటి పథకాల నిర్మాణానికి నిధులు మంజూరైనట్టు చెప్పారు.అనకాపల్లి కార్మిక శాఖ సహాయక అధికారి బాలకృష్ణ మాట్లాడుతూ ఈశ్రమ్ పోర్టల్‌లో అసంఘటిత కార్మికులు పేర్లు నమోదు చేసుకొని లబ్ధి పొందాలని, ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.2 లక్షల పరిహారాన్ని ప్రభుత్వం అందజేస్తుందన్నారు. అటవీశాఖ పరిధిలోలేని స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు ఆక్రమణలుగా పేర్కొంటూ వాటి తొలగింపునకు అధికారులు నోటీసులు ఇవ్వడాన్ని ఉపసంహరించుకోవాలని కొత్తపల్లి సర్పంచ్ శ్యాం అటవీ శాఖ అధికారులను కోరారు. గైర్హాజరైన ఎక్సైజ్, ఆర్టీసీ అధికారులు సంజాయిషీ ఇవ్వాలని సమావేశం కోరింది. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ వేణుగోపాలరావు, ఎంపీడీవో కొంకి అప్పారావు, వైస్ ఎంపీపీలు పెంటకోట జ్యోతి, నమ్మి మీనా, ఎంపీటీసీ సభ్యులు చెవ్వేటి చంద్రమ్మ, యల్లపు నూకరత్నం, నడిపల్లి గంగతల్లి, సర్పంచ్‌లు కలగా గున్నయ్యనాయుడు, కోన అరుణ, కోన నాయుడు, కలిగెట్ల నూకర త్నం, మండల విద్యా శాఖ అధికారి చిట్టిబాబు, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చూచుకొండలో నగర సంకీర్తన



చూచుకొండలో నగరసంకీర్తనలో పాల్గొన్న భక్తులు

మునగపాక : మండలంలోని చూచుకొండ గ్రామంలో నగర సంకీర్తన కార్యక్రమం ఘనంగా సాగుతుంది. ధనుర్మాసంలో భాగంగా గ్రామానికి చెందిన సుమారు 200 మంది మహిళలు, పురుషులు కలిసి నగర సంకీర్తనలో భాగస్వామ్యులవుతున్నారు. ధనుర్మాస ఉత్సవ కమిటీలో భాగంగా గ్రామంలోని అన్ని దేవాలయాల వద్ద సామూహిక హారతి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం తెల్లవారున నిర్వహించిన నగర సంకీర్తనలో భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

గరుడ వాహనంపై గోపాలుడు



స్వామివారికి తిరువీధి సేవలు నిర్వహిస్తున్న అర్చకులు

నక్కపల్లి : ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఉపమాక వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం గరుడ వాహనంపై స్వామివారికి తిరువీధి సేవలు నిర్వహించారు. ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు నిత్యాభిషేకం, అర్చనలు నిర్వహించారు. అనంతరం బాల భోగ నివేదన, రాజభోగ నివేదన, నీరాజన మంత్రపుష్పాలు, తీర్థగోష్ఠి, ప్రసాద వినియోగం నిర్వహించారు. రాత్రి స్వామి వారిని పల్లకీలో ఊరేగించారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో తిరుప్పావై 22వ పాశురాన్ని విన్నపం చేశారు.

వచ్చేనెల 20లోగా ఈ-క్రాప్ నమోదు

- జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు



సమావేశంలో మాట్లాడుతున్న మోహనరావు

అనకాపల్లి టౌన్: రైతులందరూ ఫిబ్రవరి 20వ తేదీ లోగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు తెలిపారు. పట్టణంలోని గవరపాలెం రైతుభరోసా కేంద్రంలో శనివారం డివిజన్ వ్యవసాయాధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 21వ తేదీ నుంచి 28వతేదీ వరకు సామాజిక తనిఖీ కోసం జాబితాను ఉంచుతామన్నారు. మార్చి 1 నుంచి 5వ తేదీ వరకు స్థానిక రైతుభరోసా కేంద్రాల్లో అభ్యంతరాలు స్వీకరిస్తామని తెలిపారు. అదే నెల 7వతేదీన ఆఖరి జాబితా ఖరారు చేస్తామని చెప్పారు. డివిజన్, మండల వ్యవసాయాధికారులందరూ ఈ-క్రాప్‌పై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఈ-క్రాప్ నమోదు చేయించుకున్న రైతులతో ఈకేవైసీ చేయించాలని తెలిపారు. ప్రధానమంత్రి కిసాన్ సమాన్ నిధి ఈకేవైసీ గడువు జనవరి 15వతేదీ వరకు పెంచినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ కె.రామారావు, వ్యవసాయాధికారులు రంగాచారి, జ్యోత్స్న, స్వప్న, ఏఈవోలు, వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు



అలరించిన రంగవల్లులు



హరిదాసు వేషధారణతో పాటు సంప్రదాయ దుస్తుల్లో చిన్నారులు

అనకాపల్లి రూరల్/అనకాపల్లి టౌన్ : పట్టణంలోని విద్యాలయాల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు శనివారం ఘనంగా జరిగాయి. ప్లేస్కూల్ చిన్నారులు హరిదాసుల వేషధారణలతో ఆకట్టుకున్నారు. భోగీ మంట వెలిగించారు. కరస్పాండెంట్ శెట్టి గిరీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఓ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన వేడుకలను ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వసంత రాజేంద్ర ప్రసాద్ ప్రారంభించారు. విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణతో పాల్గొన్నారు. విద్యార్థినులు వేసిన రంగవల్లులు అలరించాయి. సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. సంక్రాంతి ఫ్యాషన్ డ్రెస్ కాంపిటీషన్ నిర్వహించి బహుమతులు అందజేశారు.

రూ.లక్ష విలువైన కొబ్బరికాయలు దగ్ధం



అగ్నిప్రమాదంలో దగ్ధమవుతున్న కొబ్బరికాయల పాక

ఎస్.రాయవరం : మండల కేంద్రం ఎస్.రాయవరంలో కొబ్బరికాయలతో నిల్వ ఉన్న పూరిపాక శనివారం దగ్ధమైంది. దీంతో సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లినట్టు అంచనా. గ్రామానికి చెందిన వెలగా శ్రీను కొన్ని నెలలుగా తోటలో నుంచి సేకరించిన సుమారు 20 వేల కొబ్బరికాయలను పాకలో నిల్వ ఉంచాడు. ప్రమాదవశాత్తూ పాకకు నిప్పంటుకుని మొత్తం కాలిబూడిదైందని శ్రీను చెప్పాడు. ఇందులో ఉన్న కొబ్బరికాయలు పూర్తిగా కాలిపోయాయని తెలిపాడు. వివరాలు మేరకు నష్టం వివరాలు అంచనా వేస్తున్నట్టు రెవెన్యూ అధికారులు చెప్పారు.